


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

గురువారం,
అక్టోబరు 30, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## కేబినెట్‌లోకి అజారుద్దీన్



అభియోగాల సమ్మతిలో తీవ్ర జాప్యంపై

## సుప్రీం సీరియస్

::: దేశవ్యాప్తంగా

ఏకరూప మార్గదర్శకాల జారీకి మొగ్గు

## అందరూ సమన్వయంతో పని చేసి పార్టీ పురోగతికి పాటుపడాలి



కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను ఆందోళనలతో ఎండగట్టండి

ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ దిశానిర్దేశం



## పత్తి, ధాన్యం విక్రయ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి

తుపాను నేపథ్యంలో

అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

రైలు ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

హైదరాబాద్, ఉమ్మడి ఖమ్మం,
వరంగల్, నల్లగొండ జిల్లాల్లో అధిక ప్రభావం

అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి

హైదరాబాద్: మోంథా తుపాను ప్రభావంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను బుధవారం ఆరా తీశారు. వరి కోతల సమయం,.. పలుచోట్ల కళ్లాల్లో ధాన్యం ఆరబోసిన నేపథ్యంలో ఎటువంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మోంథా ప్రభావం ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో అధికంగా ఉండటం.. హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండటంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎం నిర్దేశించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడం.. పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు దారి మళ్లించిన నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మోంథా ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సమన్వయం చేసుకోవాలని.. జిల్లా కలెక్టర్లు మార్గదర్శకత్వం వహించాలని సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా

(మిగతా 2వ పేజీలో)

# మోంథా ఉగ్రరూపం

## 105 ప్రాంతాల్లో 10 సెం.మీ. కంటే ఎక్కువ వర్షపాతం

అత్యధికంగా భీమదేవరపల్లిలో 41.04 సెం.మీ.

పొంగిపొర్లుతున్న వాగులు.. మళ్లీ మత్తళ్లు దుంకుతున్న చెరువులు

చేతికొచ్చిన పంటలు నీటిపాలు.. అన్నదాతల గగ్గోలు

నాగర్‌కర్నూల్, ఉమ్మడి వరంగల్ జిల్లాలు అతలాకుతలం

రోడ్లపై వాహనాలు బంద్.. నిలిచిపోయిన పలు రైళ్ల రాకపోకలు

సూర్యాపేట జిల్లాలో చెట్టు కూలి రోడ్డుపై వెళ్తున్న వ్యక్తి మృతి

నేడు, రేపు కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామకు రెడ్ అలర్ట్





హైదరాబాద్:మోంథా తుపాను రాష్ట్రాన్ని అతలాకుతలం చేసింది. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో బుధవారం అనేక జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. చాలాచోట్ల రహదారులు తెగిపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. చెరువులు, కుంటలు తెగిపోగా... కాల్వలు, వాగులు ఉప్పొంగాయి. వరదనీరు పొలాలను ముంచేసింది. పంటలు నేల కొరిగాయి. కాలనీలు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరదనీరు చేరడంతో బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. నాగర్‌కర్నూల్, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని చాలాచోట్ల భారీ వర్షాలు నమోదయ్యాయి. 29 ప్రాంతాల్లో అతిభారీ వర్షాలు కురిశాయి. ఈ ప్రాంతాల్లో 12 గంటల్లోనే 20 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిసింది. 105 ప్రాంతాల్లో ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 10 సెంటీమీటర్లకు పైబడి వర్షపాతం నమోదైంది. గత ఐదేళ్లలో ఈ స్థాయిలో భారీ వర్షాలు నమోదు కావడం ఇదే ప్రథమం. మంగళవారం రాత్రి ఏపీలోని నర్సాపురం వద్ద తీరం దాటిన మోంథా తీవ్ర తుపాను ప్రభావం తెలంగాణపై

(మిగతా 2వ పేజీలో)



## దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్నారు

మున్నూరు కాపు

ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్

హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు నమోదు చేయించినట్లు తెలిసిందని, ప్రజలు ఎలాగూ ఓటు వేయరని తెలిసి, దొంగ ఓట్లతో గెలవాలని చూస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. ఈ నియోజకవర్గంలో 13 వేల దొంగ ఓట్లు సృష్టించారని, ప్రజలు అప్రమత్తంగా లేకపోతే కాంగ్రెస్‌కు చెందిన వారు ఎవరో ఒకరు ఓటు వేస్తారని అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి సోదరుడికే మూడు ఓట్లు ఉన్న విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన 'మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం'లో కేటీఆర్ మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో మంత్రులు కొత్త వేషాలు వేసుకుని అభివృద్ధి చేస్తామని గల్లీ లీడర్లలా తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలను అంగట్లో సరుకులా కొని ఉప ఎన్నికలో గెలిచేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థి స్వయంగా బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఆయన గెలిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఓటర్లు ఆలోచించాలని

(మిగతా 2వ పేజీలో)

## రఫేల్ ఫైటర్ జెట్‌లో ముర్ము విహారం



రెండు వేర్వేరు ఫైటర్ జెట్లలో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా రికార్డు

అంబాలా ఎయిర్‌బేస్ నుంచి 30 నిమిషాలపాటు ప్రయాణం

పైలట్‌గా వ్యవహరించిన గ్రూప్ కెప్టెన్ అమిత్ గెహానీ

# మోంథా ఉగ్రరూపం

తీవ్రంగా పడింది. బుధవారం సాయంత్రానికి మోంథా బలహీనపడి వాయుగుండంగా మారింది. గురువారం మధ్యాహ్నం కల్లా దీని ప్రభావం పూర్తిగా తగ్గనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఈ ఏడాది జూన్ నుంచి అక్టోబర్ 29 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 82.90 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... 110.87 సెంటీమీటర్లు నమోదైంది. సాధారణం కంటే 34 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. 5 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 20 జిల్లాల్లో అధికం, 8 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు రాష్ట్ర ప్రణాళిక శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.



### ఓరుగల్లు అతలాకుతలం

ఉమ్మడి వరంగల్ జిల్లాను మోంథా తుపాను కుదిపేసింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు దంచికొట్టిన వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ప్రధానంగా వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాలపై తుపాను తీవ్ర ప్రభావం చూపింది. కోతకొచ్చిన వరి పంట నేలరాలింది. ఇప్పటికే కోతలు పూర్తయి కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం కల్లాల్లోనే తడిసింది. మిర్చి, మొక్కజొన, పత్తి రైతుల పరిస్థితి ఆగమాగమైంది. 30 శాతమే వరికోతలు పూర్తి కాగా, సుమారు 4.50 లక్షల ఎకరాల్లో కోతలకు సిద్ధమయ్యాయి. పత్తి ఏరడానికి సిద్ధమైన తరుణంలోనే తుపాను రావడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. వరంగల్, హనుమకొండ, కాజీపేటలోని సుమారు 71 కాలనీల్లో వరద నీరు చేరినట్లు సమాచారం. గురువారం కూడా తుపాను కొనసాగుతుందన్న వాతావరణశాఖ హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగాг ఆరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లో టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేశారు.

### జలదిగ్బంధంలో 'గ్రేటర్ వరంగల్'...

భారీ వర్షాలకు వరంగల్ నగరంలోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. హనుమకొండ బస్టాండ్‌లోకి భారీగా వరద చేరి చెరువును తలపించింది. ఎస్ఆర్ నగర్, వివేకానందనగర్, సాయిగణేశ్‌కాలనీ, లక్ష్మీ గణపతి కాలనీ, మధురానగర్, గిరిప్రసాద్‌నగర్, గాంధీనగర్, మైసయ్యనగర్, భద్రకాళినగర్, పోతననగర్, రాజీవ్‌నగర్, సమ్మయ్యనగర్, వాజ్‌పేయి కాలనీ, విద్యానగర్, పోచమ్మకుంట, ఇంద్రానగర్, దీన్‌దయాళ్‌నగర్, కాజీపేట ప్రశాంత్‌నగర్, బ్యాంక్ కాలనీల్లోకి వరద నీరు చేరింది. ప్రధాన నాలాలు పొంగిపొర్లాయి. హనుమకొండ, నయీంనగర్, కేయూ క్రాస్‌రోడ్డు, ములుగు క్రాస్‌రోడ్డు, హంటర్‌రోడ్డు, ఎన్జీవోస్ కాలనీ, అంబేద్కర్ స్టేడియం తదితర ప్రాంతాల్లో వరదనీరు రోడ్లపైకి రావటంతో గంటలపాటు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో వాగులు పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. రైల్వే స్టేషన్లు, రైలు పట్టాలపైకి వరద చేరడంతో దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్ల రాకపోకలను నిలిపి వేసింది. వరంగల్‌లో ఇంటర్‌సిటీ, ఈస్ట్‌కోస్ట్, మహబూబాబాద్‌లో కృష్ణ ఎక్స్‌ప్రెస్‌లను నిలిపి వేసినట్లు అధికారులు తెలిపారు. వరంగల్ మీదుగా వెళ్లే పలు రైళ్లు షాలిమార్, టాటా నగర్, షిరిడీ, కాకినాడ ఎక్స్‌ప్రెస్‌ను వయా కాజీపేట మీదుగా దారి మళ్లించి భాగ్యనగర్, శాతవాహనను కూడా రద్దు చేశారు.

### రంగారెడ్డిలో పొంగుతున్న వాగులు

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో బుధవారం కుండపోత వర్షం కురిసింది. తలకొండపల్లిలో అత్యధికంగా 11.72 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పంట పొలాలు నీట మునిగాయి. కల్లాలు, మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం తడిపోయింది. పత్తి, వరి, కూరగాయలు, పూల తోటలకు తీరని నష్టం వాటిల్లింది. మూసీ, ఈసీ, కాగ్నా సహా పలు చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం వీర్‌శెట్టిపల్లి గ్రామానికి చెందిన యువకులు కాగ్నా వాగులో కొట్టుకుపోతున్న యాలాల మండలం అగ్గనూరుకు చెందిన పెద్దింటి నర్సింలు అనే వ్యక్తిని కాపాడారు. అతడు కొద్ది రోజులుగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నట్లు సమాచారం.

### సిద్దిపేట జిల్లాలో వర్ష బీభత్సం

సిద్దిపేట జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం కుండపోత వర్షం కురిసింది. హుస్నాబాద్ నియోజకవర్గంలో 21.28 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొనుగోలు కేంద్రాల్లో, మార్కెట్ యార్డుల్లోని ధాన్యం కుప్పలు తడిసిముద్దయ్యాయి. హుస్నాబాద్ పట్టణంలోని దుకాణాల్లోకి వరద నీరు చేరింది. ఆర్టీసీ బస్టాండ్‌లోని ప్లాట్‌ఫాంల పైకి నీరు రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గురువారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

# రఫేల్ ఫైటర్ జెట్‌లో ముర్ము విహారం

చేరుకున్నారు. ఈ విమానానికి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ 17వ స్క్వాడ్రన్ 'గోల్డెన్ ఆరోస్' కమాండింగ్ ఆఫీసర్, గ్రూప్ కెప్టెన్ అమిత్ గెహానీ పైలట్‌గా వ్యవహరించారు. 2020 జూలైలో ఫ్రాన్స్ నుంచి వచ్చిన రఫేల్ విమానాల మొదటి బ్యాచ్‌ను ఈ 'గోల్డెన్ ఆరోస్' స్క్వాడ్రనే స్వీకరించింది. 'ఆపరేషన్ సిందూర్'లో ఈ స్క్వాడ్రన్ కీలక పాత్ర పోషించింది.

### మర్చిపోలేని గొప్ప అనుభవం

ఈ చారిత్రక పర్యటన అనంతరం రాష్ట్రపతి ముర్ము సందర్శకుల పుస్తకంలో తన అనుభూతిని పంచుకున్నారు. 'రఫేల్ యుద్ధ విమానంలో నా తొలి ప్రయాణం కోసం అంబాలా ఎయిర్‌బేస్‌ను సందర్శించడం ఆనందంగా ఉంది. ఇది నాకు మర్చిపో లేని గొప్ప అనుభవం. శక్తివంతమైన రఫేల్‌లో ఈ ప్రయాణం దేశ రక్షణ సామర్థ్యాలపై నాకు కొత్త నమ్మకాన్ని, గర్వాన్ని కలిగించింది. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన భారత వైమానిక దళాన్ని, అంబాలా ఎయిర్‌బేస్ బృందాన్ని అభినందిస్తున్నాను" అని పుస్తకంలో రాష్ట్రపతి రాశారు.

### యుద్ధ విమానంలో మూడో రాష్ట్రపతి

యుద్ధ విమానంలో ప్రయాణించిన మూడో భారత రాష్ట్రపతిగా ద్రౌపదీ ముర్ము రికార్డుకెక్కారు. ఈ ఘనత సాధించిన మొట్టమొదటి రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం. ఆయన 2006 జూన్ 8న పుణెలో సుఖోయ్%-%30 ఎంకేఐ విమానంలో ప్రయాణించారు. ఆ తర్వాత 2009 నవంబర్ 25వ తేదీన అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ పుణెలో సుఖోయ్%-%30 ఎంకేఐలో ప్రయాణించి



ఈ ఘనత సాధించిన తొలి మహిళా రాష్ట్రపతిగా నిలిచారు. అయితే, ద్రౌపదీ ముర్ము 2023 ఏప్రిల్ 8వ తేదీన అస్సాంలోని తేజ్‌పూర్ ఎయిర్‌బేస్ నుంచి సుఖోయ్%-%30 ఎంకేఐలో, ఇప్పుడు అంబాలా నుంచి రఫేల్‌లో ప్రయాణించి.. రెండు వేర్వేరు రకాల ఫైటర్ జెట్లలో విహరించిన ఏకైక రాష్ట్రపతిగా విశిష్టమైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు.

రఫేల్ పర్యటన సందర్భంగా అంబాలా ఎయిర్‌బేస్‌లో భారత వైమానిక దళం స్క్వాడ్రన్ లీడర్ శివాంగి సింగ్ రాష్ట్రపతి ముర్మును కలిశారు. వారిద్దరి ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు చెందిన రఫేల్ ఫైటర్ జెట్‌ను కూల్చివేశామని, పైలట్ శివాంగి సింగ్‌ను అదుపులోకి తీసుకున్నామని పాకిస్తాన్ గొప్పలు చెప్పుకుంది. అందులో ఏమాత్రం వాస్తవం లేదని భారత్ తేల్చిచెప్పింది. బుధవారం రాష్ట్రపతి ముర్ముతో శివాంగి సింగ్ ఫొటో బయటకు రావడంతో పాకిస్తాన్ గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. శివాంగి సింగ్ ఐఎఫ్ గోల్డెన్ ఆరోస్ స్క్వాడ్రన్ సభ్యురాలిగా సేవలందిస్తున్నారు. దేశంలో ఇప్పటివరకు మొట్టమొదటి, ఏకైక రఫేల్ మహిళా పైలట్‌గా రికార్డుకెక్కారు. ఆపరేషన్ సిందూర్‌లో రఫేల్ ఫైటర్‌జెట్‌ను విజయవంతంగా నడిపించారు. కచ్చితత్వంతో కూడిన దాడులతో పాకిస్తాన్‌కు చుక్కలు చూపించారు. 29 ఏళ్ల శివాంగి సింగ్ వారణాసిలో జన్మించారు. 2017లో భారత వైమానిక దళంలో చేరారు. మహిళా ఫైటర్ పైలట్‌గా రెండో బ్యాచ్‌లో శిక్షణ పొందారు. తొలుత ఎంఐజీ%-%21 బైసన్ యుద్ధ విమానం నడిపించారు. 2020లో రఫేల్ పైలట్‌గా అర్హత సాధించారు. ఈ నెల 9న క్వాలిఫైడ్ ఫ్లైయింగ్ ఇన్‌స్ట్రక్టర్(క్యూఎఫ్ఐ) బ్యాడ్జ్ సొంతం చేసుకున్నారు. యుద్ధ విమానాల సారథిగా ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన శివాంగి సింగ్‌ను ఎయిర్ మార్షల్ తేజ్‌బీర్ సింగ్ ఆనాడు ఘనంగా సత్కరించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆమె పేరు మార్మోగిపోయింది. ఆమె తప్పిపోయినట్లుగా ఓ వీడియో బయటకు వచ్చింది. అదంతా ఉత్తదేనని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది.

# అభియోగాల సమ్మతిలో తీవ్ర జాప్యంపై సుప్రీం సీరియస్

## దేశవ్యాప్తంగా ఏకరూప మార్గదర్శకాల జారీకి మొగ్గు



న్యూఢిల్లీ: నేరమయ కేసుల్లో చార్జ్‌షీట్ దాఖ లుచేశాక సైతం ట్రయల్ కోర్టులు అభియో గాల నమోదుపై తుదినిర్ణయం తీసుకోకపో వడం, దీంతో కేసుల విచారణలో జాప్యంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. దీంతో క్రిమినల్ కేసుల కొండ పేరుకుపోయి న్యాయస్థానాలపై పనిభారం, ఒత్తిడి అత్యంత తీవ్రంగా ఉంటోందని, చివరకు కొన్ని కేసుల విచారణ దశాబ్దాల తరబడి కొనసాగుతోందని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ నేప థ్యంలో దేశవ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో అమలయ్యేలా ఏకరూప నిబంధనావళిని రూ పొందిస్తామని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్‌వీ అంజారి యాల ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ విషయంలో తమకు సహాయకులుగా ఉండాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాలను కోర్టు కోరింది. "మేం అంతా గమనిస్తున్నాం. సమ యం గడుస్తోందిగానీ ట్రయల్ కోర్టుల్లో పద్ధతి మారట్లేదు. నిందితులపై పోలీసులు, దర్యాప్తు సంస్థలు నేరాభియోగాలు మోపుతు న్నారు. సంబంధిత ఛార్జ్‌షీట్‌లను ట్రయల్ కోర్టులకు సమ ర్పిస్తున్నారు. కానీ ట్రయల్ కోర్టులు మాత్రం మూడు, నాలుగేళ్లు గడుస్తున్నా చార్జ్‌షీట్‌లపై తమ నిర్ణయాన్ని ఖరారుచేయట్లేవు. దీంతో విచా రణ మరింత ఆలస్యమవుతోంది. నేరం నమోదుకాకపోతే అసలా కేసులో వాదోపవాదనలు మొదలుకావు. ఇకనైనా కింది కోర్టుల వైఖరి మారేలా దేశవ్యాప్త గైడ్‌లైన్స్ ఇవ్వాల్సిందే" అని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ అంశంలో కోర్టు సహాయకులు(అమికస్ క్యూరీ)గా సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రాను ధర్మాసనం నియమించింది. బిహార్‌లో క్రిమినల్ కేసుకు సంబంధించి ఒక వ్యక్తిపై చార్జ్‌షీట్ దాఖలై రెండేళ్లు గడుస్తున్నా కిందికోర్టు ఆ నేరాభియోగాలపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నాన్చుడి ధోరణి అవలంభిస్తోందని, తన క్లయింట్‌కు న్యాయం చేయాలంటూ ఒక న్యాయవాది చేసిన అభ్యర్థన సందర్భంగా సుప్రీంకోర్టు పైవిధంగా స్పందించింది. ఈ కేసును రెండు వారాల తర్వాత విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. "మహారాష్ట్రలోనూ ఇదే పరిస్థితి ఉంది. 600కుపైగా కేసులో ఇంకా విచారణ కోర్టులు దాఖలైన ఛార్జ్‌షీట్‌లపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు" అని మరో న్యాయవాది వాదించారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత చట్టం ప్రకారం సెషన్స్ కోర్టులో ఏదైనా కేసు విచారణకు వస్తే చార్జ్‌షీట్ దాఖలైన 60 రోజుల్లోపు ఆ నేరాభియోగాలపై సెషన్స్ కోర్టు తుది నిర్ణయం తీసుకోవాల్సిందే. " నేరాన్ని వెంటనే నమోదుచేయని కారణంగా ట్రయల్ కోర్టుల్లో క్రిమినల్ కేసుల విచారణ ఆలస్య మవుతోంది. సివిల్ కేసుల్లో ట్రయల్ కోర్టులు ఆయా అంశాలను సరిగా ప్రస్తావించని కారణంగా ఆలస్యమవుతోంది"అని జస్టిస్ కుమార్ అన్నారు. మాజీ హైకోర్టు న్యాయమూర్తి, సీనియర్ న్యాయవాది ఎస్.నాగముత్తు ఈ అంశంలో కోర్టుకు సహాయకులుగా ఉండాలని సుప్రీంకోర్టు కోరింది.



# పత్తి, ధాన్యం విక్రయ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి

ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని చెప్పారు. నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని చెప్పారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తుపాను ప్రభావంతో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పురపాలక, గ్రామాల పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. వైద్యారోగ్య శాఖ తగినన్ని మందులను అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రాణ, ఆస్తి నష్టం, పశు నష్టం జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో సాగాలని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# కేబినెట్‌లోకి అజారుద్దీన్

హైదరాబాద్: ఎల్లుండి తెలంగాణ కేబినెట్ విస్తరణ జరగనుంది. ప్రస్తుతం మూడు మంత్రి పదవులు ఖాళీ ఉండగా.. ఎల్లుండి(అక్టోబర్ 31, శుక్రవారం) కేబినెట్‌లోకి అజారుద్దీన్ చేరనున్నారు. రాజభవన్‌లో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ తర్వాత మరో రెండు మంత్రి పదవులను భర్తీ చేసే అవకాశం ఉంది. కొన్ని నెలల క్రితం రేవంత్‌రెడ్డి. ?ముగ్గురిని మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. అజారుద్దీన్‌కి ఎమ్మెల్సీ ఇస్తామని గతంలో కాంగ్రెస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించింది. ఇటీవల ప్రభుత్వం.. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రతిపాదన పంపింది. నిన్న(అక్టోబర్ 28, మంగళవారం) సాయంత్రం సీఎం రేవంత్‌ను అజారుద్దీన్ కలిశారు. అజారుద్దీన్ రాకతో కేబినెట్‌లో ఇంకా రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. మాజీ క్రికెటర్, టీమిండియా మాజీ కెప్టెన్ అయిన ముహమ్మద్ అజహరుద్దీన్.. 2009 ఫిబ్రవరి 19వ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున మురాదాబాద్ (ఉత్తరప్రదేశ్) లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత 2014లో టోంక్ (రాజస్థాన్) నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తెలంగాణకు తిరిగొచ్చిన ఆయన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సేవలందించారు. 2023లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు.

# అందరూ సమన్వయంతో పని చేసి పార్టీ పురోగతికి పాటుపడాలి

హైదరాబాద్: అందరూ సమన్వయంతో పని చేసి రాష్ట్రంలో పార్టీ పురోగతికి పాటుపడాలని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్రఇన్‌చార్జ్ సునీల్‌బన్సల్ దిశా నిర్దేశం చేశారు. పార్టీ తరఫున ఎన్నికైన అన్ని స్థా యిల ప్రజాప్రతినిధులు మరింతగా పార్టీ బలోపే తం, విస్తరణకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తున్నందున, ఎన్నికల హామీల అమలు, ముఖ్యమైన సమ స్యల పరిష్కారంలో వైఫల్యాలను ఎండగడుతూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ వైఖరి, విధానాలు, క్రమశిక్షణ, మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఎంతటి పెద్ద నాయకులు వ్యవహరించినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పార్టీ అభ్యర్థికి విజయావకాశాలు మెండుగా ఉన్నాయని, పార్టీ నాయకులంతా సమన్వయంతో ప్రచారం చేసి గెలిపించుకునేందుకు కృషి చేయాలని సూచించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఎంపీలు డీకే.అరుణ, ఈటల రాజేందర్, గొడెం నగేశ్, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, ఎమ్మెల్సీలు ఏవీఎన్‌రెడ్డి, మల్క కొమురయ్యలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, రాష్ట్రపార్టీ ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్, ఇతరనేతలు పాల్గొన్నారు.

### వారిపై పార్టీ నమ్మకం పెట్టుకుంది : రాంచందర్‌రావు

బీజేపీ నాయకులు, కార్యకర్తలపై జాతీయ నాయకత్వం బలమైన నమ్మకాన్ని పెట్టుకుందని బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉందని, పార్టీ అభ్యర్థి గెలుస్తాడనే ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నామన్నారు. విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం రాంచందర్‌రావు అధ్యక్షతన రాష్ట పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అదే ఎంఐఎంకు వేసినట్టేనని చెప్పారు. పోలీస్ స్టేషన్లలో బైండోవర్ అయ్యే కాంగ్రెస్ అభ్యర్థి కావాలా? లేక ప్రజా సమస్యల పరిష్కారానికి అభివృద్ధి కోసం పనిచేసే బీజేపీ అభ్యర్థి కావాలా? ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అరాచకాలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన తప్పుడు హామీలు, అమలు కాని 6 గ్యారంటీలను ప్రజల ఎదుట ఎండగట్టాలన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఇతర నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్నారు: కేటీఆర్

అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే రూ.వెయ్యి కోట్లు ఇస్తామని హామీ ఇచ్చి ఒక్క పని చేయలేదన్నారు. అభివృద్ధి నిధుల కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రపంచ బ్యాంకుకు లేఖలు రాస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించడంతో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదు. ఇందిరమ్మ రాజ్యం అంటూ.. పేదల కోసం ఒక్క ఇల్లు కట్టకున్నా హైడ్రా పేరిట బుల్డోజర్లతో పేదల ఇళ్లు కూల్చారు. యూసుఫ్‌గూడలో సన్మానం పేరిట ముఖ్యమంత్రే వెళ్లి సినీ కార్మికులతో శాలువాలు కప్పించుకున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరిట మోసగించారు. బడ్జెట్‌లో ఏటా బీసీలకు రూ.20 వేల కోట్లు పెడతామని, ఆ దిశగా రేవంత్ ప్రయత్నం చేయలేదు'అని కేటీఆర్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, కోరుకంటి చందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి పట్ల విశ్వాసంతో కాంగ్రెస్ వైపు అడుగులు

**- కాంగ్రెస్ పార్టీ లో బిజెపి, బిఆర్ఎస్ నాయకులు చేరికలు**

**- ఎమ్మెల్యే ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



కల్వకుర్తి, అక్టోబర్ 29 వార్త మిర్రర్ ప్రతినిధి:– ప్రజా సంక్షేమ పథకాలను చూసి, రాష్ట్ర అభివృద్ధి దిశగా సీఎం రేవంత్ రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.కడ్తాల మండలం రావిచేడ్ గ్రామానికి చెందిన జగన్ చారి, విక్రమ్ చారి, వినోద్ చారి, బ్రహ్మచారి, సునీల్, ఉపేందర్ జీ, రాకేష్ రెడ్డి, శివాజీ, ముజీబ్, గౌసొద్దీన్, మహేష్, శ్రీను, బూరెల ప్రవీణ్, మర్చి రాజు, నరేష్, ముఖేందర్ చారి, దేవేందర్, చితకింద దేవేందర్, శివకత్ర కుమారి, శివారెడ్డి, చంద్రయ్య తదితరులు గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నం ప్రభాకర్ గౌడ్ సమక్షంలో కొత్తగా చేరిన నాయకులను ఆహ్వానించారు.ఎమ్మెల్యే నారాయణ రెడ్డి మాట్లాడుతూ…రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన పునరుద్ధరణ జరుగుతోంది. ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ప్రజలకు ఆచరణలో కనిపించే సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయి. ఈ విశ్వాసం కారణంగానే ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ వైపు వస్తున్నారు. కొత్తగా చేరిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని ఆశిస్తున్నాం," అని అన్నారు.రాష్ట్రాభివృద్ధి కోసం, సామాన్య ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోంది. గ్రామస్థాయిలో పార్టీని బలపరచడమే మన లక్ష్యం," అని తెలిపారు.

# 42% బీసీ రిజర్వేషన్ ప్రైవేటు బిల్లును రాహుల్ గాంధీ పార్లమెంట్లో ప్రవేశపెట్టాలి.

**రాష్ట్ర బంద్ కు మద్దతిచ్చిన అన్ని పార్టీలు బిల్లును పార్లమెంటులో బలపరచాలి.**

**రాజ్యాంగ సవరణ,పార్లమెంట్లో ప్రత్యేక బిల్లు కోసం ఎంతకైనా తెగిస్తాం..**

**నవంబర్ 2 హైదరాబాద్ లో బీసీ జేఏసీ విస్తృతస్థాయి సమావేశం..**

**ఖరారు కానున్న రాష్ట్ర, జిల్లా స్థాయి జేఏసీ కమిటీలు - దాసు సురేష్ ,బీసీ జేఏసీ - కో చైర్మన్**



హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 29 తెలంగాణ రాష్ట్ర బంద్ ను సంపూర్ణంగా విజయవంతం చేసిన వివిధ పార్టీలు, కుల సంఘాల ప్రతినిధులతో అంతర్గతంగా సమావేశమైన బీసీ జేఏసీ నాయకులు చీఫ్ కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ నేతృత్వంలో కాచిగూడలోని అభినందన హోటల్ ప్రత్యేకమైన సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి బీసీ జేఏసీ కో చైర్మన్ దాసు సురేశ్ ముఖ్యఅతిథిగా విచ్చేసారు. నవంబర్ 2న బంజారా హిల్స్ నందు గల కళింగ భవన్లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నామని దాసు సురేశ్ తెలిపారు. ఈ సమావేశానికి సంబంధించిన పోస్టర్ను బీసీ జేఏసీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. తదనంతరం దాసు సురేశ్ మీడియాతో మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రాజ్యాధికార వాటా కోసం ఈ నెల 18న నిర్వహించిన తెలంగాణ బీసీ బంద్ లో అన్ని పార్టీలను భాగస్వామ్యులను చేయడంలో తాము విజయం సాధించగలిగామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావటానికి న్యాయపరంగా, రాజ్యాంగపరంగా ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించటానికి స్పష్టమైన కార్యాచరణను బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నవంబర్ 2 న ప్రకటించనున్నామన్నారు . 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేయటానికి అవసరమైన రాజ్యాంగ సవరణను పార్లమెంటులో చేపట్టడానికి కాంగ్రెస్ పార్లమెంటరీ నాయకులు రాహుల్ గాంధీ రాజ్యాంగ సవరణను ప్రతిపాదించేలా, ప్రత్యేకమైన బీసీ ప్రైవేట్ బిల్ ను ఇండీ కూటమి ప్రవేశపెట్టేలా తెలంగాణ ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకు రానున్నామన్నారు. ఇందుకు అవసరమైన అఖిల పక్షాన్ని బీసీ జేఏసీ నాయకత్వంలో ఏర్పరచి ముఖ్యమంత్రి తో త్వరలోనే భేటీ ఏర్పాటు చేయనున్నామన్నారు..ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీలను ఉద్యమంలో మమేకం అయ్యే విధంగా జాతీయ రహదారుల దిగ్బంధం, వంటావార్పు, మిలియన్ మార్చ్,సాగరహారం, పెన్ డౌన్ , కుల సంఘాల సహాయ నిరాకరణ తదితర అనేక కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు.పార్లమెంటులో భాగస్వాములైన 29 పార్టీల మద్దతును కూడగట్టడానికి రాబోయే శీతాకాల సమావేశంలో ఢిల్లీ వేదికగా అన్ని పార్టీలను సమావేశపరచి పెద్ద ఎత్తున బీసీల రిజర్వేషన్ పోరాటాన్ని తీవ్రతరం చేయనున్నామన్నారు. బీసీల అవకాశాలకు అడ్డుపడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. నవంబర్ 2న జరిగే విస్తృతస్థాయి సమావేశంలో పూర్తిస్థాయి రాష్ట్ర, జిల్లా కమిటీలను బీసీ జేఏసీ కమిటీలను ఖరారు చేయనున్నామని దాసు సురేశ్ తెలిపారు.బిసి జేఏసీ కోఆర్డినేటర్ కుల్కచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి వేదికైన కళింగ భవన్ నుండి బీసీ ఉద్యమాన్ని తీవ్రతరం చేయనున్నామన్నారు.. బీసీల రిజర్వేషన్లను అమలుపరచడానికి తెలంగాణ ఉద్యమం తరహాలో బొంత పురుగును సైతం ముద్దాడటానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. నవంబర్2 న జరిగే బీసీ జేఏసీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని బీసీలకు పిలుపున్సిచ్చారు . బీసీ డెమోక్రటిక్ అలెయన్స్ చైర్మన్ కోల జనార్ధన్ గౌడ్ గారు మాట్లాడుతూ అసెంబ్లీలో బీసీ బిల్లులకు మద్దతు ఇచ్చిన అన్ని పార్టీలు తెలంగాణ బందును విజయవంతం చేసిన మాదిరిగానే బీసీ జేఏసీ భవిష్యత్తులో నిర్వహించే అన్ని కార్యక్రమాలకు మద్దతుగా నిలవాలని కోరారు. బీసీ ఉద్యమాన్ని తీవ్రతరం చేయడానికి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులందరిని మమేకం చేస్తామన్నారు..ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి తంగెళ్లమూడి నందగోపాల్ ,బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర ముఖ్య కార్యదర్శి పోశాల సరస్వతి, గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు బండారు పద్మావతి,సెక్రటరీలు పులిపలుపుల జ్యోతి ,మిర్యాల శ్రీలత బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్,బీసీ డెమోక్రటిక్ అలయన్స్ కన్వీనర్ నాగమోని చిన్న రాములు ,ప్రొఫెసర్ పురుషోత్తం ఆశిష్ ,నాగుల సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు..

## కల్వకుంట్ల కవిత జనం బాట ఘన విజయం

## రంగారెడ్డి జిల్లా జాగృతి అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 : బుధవారం విలేఖరులు అందజేసిన ఒక ప్రకటనలో కప్పాటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశంలో రాష్ట్రంలోని ప్రాజెక్టు పనులపై అధ్య యనం చేసి నివేదిక సమర్పించాలని ఆదే శిం చారు. తెలంగాణ జాగృతి జనం బాటలో కవిత ముంపు గ్రామాల్లో ప్రజల పరిస్థితిని తెలుసుకుంటూ, నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని, ముంపు గ్రామాల్లో పునరావాస పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. గత రెండు సంవత్సరాలుగా ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ప్రెస్ మీట్‌లు, సోషల్ మీడియా విమర్శలతోనే సరిపెట్టుకున్నాయి తప్ప, ప్రజల మధ్యకు వెళ్లి వారి బాధలను తెలుసుకున్న సందర్భాలు చాలా తక్కువ. కానీ, కవితక్క నీళ్లు, నియామకాలు, నిధులు, అమరవీరులు, సామాజిక తెలంగాణ అంశాలపై ప్రజల్లోకి వెళ్లి మాట్లాడడంతో ప్రతిపక్ష పార్టీలు కలవరపడుతున్నాయి అని కప్పాటి పాండురంగా రెడ్డి అన్నారు.




## మరణించిన మహిళ సంఘ

## సభ్యురాలి ఇన్సూరెన్స్ అమౌంట్ నామినికి అందజేత

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 29

జగిత్యాల జిల్లా రాయికల్ పురపాలక సంఘం పరిధిలోని రాయికల్ పట్టణ మహిళ సమాఖ్య కి చెందిన శ్రీ విఘ్నేశ్వర స్లామ్ సమాఖ్య లోని శ్రీ విద్య స్వశక్తి సంఘానికి చెందిన కొత్తపెల్లి గంగు అనే సభ్యురాలు మరణించగా, ఆమె స్త్రీనిధి ద్వారా లక్ష రూపాయలు లోన్ తీసుకొని కొంత రికవరీ అమౌంట్ చెల్లింపు చేయగా, అట్టి సభ్యురాలికి సంబంధించి 84,643 రూపాయలు అప్పు నిల్వ క్లియర్ చేసుకొని ఇన్సూరెన్స్ అమౌంట్ 12,600 రూపాయలు తిరిగి సభ్యురాలీ నామిని అయిన కోడలుకి అందచేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.మనోహర్, మెప్మా టి.యం.సి. శరణ్య, ఆర్.పి. జ్యోత్స్న, సంఘ సభ్యులందరూ కలిసి, సంఘ సభ్యురాలైన నామినీకి అందజేయడం జరిగింది.



## చిన్నారి మౌనిక హాఫ్ శారీ

## వేడుకలో పాల్గొన్న ప్రముఖులు..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్ ,మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ తో కలిసి,మియాపూర్ జేపీ నగర్ నివాసితులు సునీత స్వగృహ శ్రీను దంపతుల ఆహ్వానం మేరకు వారి కుమార్తె హాఫ్ సారీ ఫంక్షన్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారి మౌనికకు ఆశీర్వచనాలు అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాజిద్ భాయ్, వంశీ, ప్రవీణ్, కామినేని వాసు,రత్నాచారి, నాగసాయి, వినోద్ ఇతరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



## నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం - క్షేత్ర దినోత్సవం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 29 జగిత్యాల జిల్లా పొలాస దత్తత గ్రామమైన రాయికల్ మండలం అల్లీపూర్, సింగరావుపేట లోని నాణ్యమైన విత్తనం – రైతన్నకు నేస్తం అను కార్యక్రమంలోని బాగంగా జె. జి. యల్. 24423 రకాన్ని సాగుచేసిన నల్లూరి లక్ష్మి జగదీశ్వర్ వరి పొలాన్ని సందర్శించి క్షేత్ర దినోత్సవం ని చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జగదీశ్వర్ జె. జి. యల్. 24423 రకం బాగుంది అని దిగుబడి బాగా వస్తుంది అని తెలిపారు. అదే విధంగా తన తోటి రైతు సోదరులకు ఈ రకాన్ని కోసిన తరువాత ఇస్తాను అని, తన పొలములోనే యాసంగికి సాగుచేస్తాను అని తెలిపారు. అదే విధంగా డా. పి. స్పందన, వై. స్వాతి శాస్త్రవేత్తలు, ఏ. యి. ఓ. సతీష్, చిన్న రెడ్డి సాగు చేస్తున్న పసుపు పంట ను చూసి దుంప తొలిచు ఈగ ఉందని తెలిపి కార్బోఫురాన్ 3% సి. జి. గుళికలను ఎకరానికి 10 కిలోల చొప్పున వేయాలి అని సూచించారు. అదే విధంగా మర్రి ఆకు తెగులను గమనించడం జరిగింది. దీని నివారణకు ప్రోపికొనజోలు అనే మందును ఎకరానికి 200 మీ.లీ ల చొప్పున పిచికారీ చేయాలనీ తెలిపారు.



## ఉప్పల ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం

### - చైర్మన్ ఉప్పల వెంకటేష్

కల్వకుర్తి అక్టోబర్ 29 వార్త మిర్రర్ ప్రతినిధి:–కల్వకుర్తి మండలంలోని బెక్కర గ్రామం బైండ్ల నారాయణ అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయాన్ని గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ శ్రీ ఉప్పల వెంకటేష్ మృతుడు కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు శేఖర్ రెడ్డి,పరశురాములు, బాల్ నాగయ్య, శ్రీశైలం, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## ఆకాల వర్షాలతో తడిసిన ధాన్యం పత్తికి

## మద్దతు ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

### బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లాలో అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, పత్తికి మద్దతు ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ డిమాండ్ చేశారుఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షానికి తడిసిన ధాన్యాన్ని, పత్తిని ప్రభుత్వం సక్రమంగా ధాన్యం సేకరణ చేపట్టక పోవడం వల్లే రైతులు నష్టపోయారని అన్నారు. నామమాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, సెంటర్లలో కనీస సౌకర్యాలు లేవన్నారు. టార్పాలిన్లు లేక ధాన్యం తడిసిందన్నారు. కొందరు రైతుల ధాన్యం నల్లబడి మొలకలు వచ్చిందన్నారు. రైతులు, ప్రజలు ఇక్కట్ల పాలవుతుంటే ఎమ్మెల్యే, అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపించారు. రైతాంగానికి న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా ఉండి పోరాడుతుందన్నారు బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



## కొనుగోలు కేంద్రాల్లో వర్షాలకు తడిసి ముద్దయిన వరి ధాన్యం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 29

బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వరి ధాన్యం తడిసి ముద్దయింది. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కిష్టంపేట, అల్లీపూర్, సింగారావు పేట, రాయికల్, పరిసర ప్రాంతాల అనేక గ్రామాలలోని కొనుగోలు కేంద్రాల్లో రైతులు అమ్ముకోవడానికి అరబోసిన వరి ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు కన్నీరు మున్నీరైయ్యారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే సమయానికి మాయదారి వర్షం నిండాముంచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధర చెల్లించాలని వేడుకుంటున్నారు. అయితే మండలంలో నాలుగైదు రోజులుగా మేఘావృతమై చిదురు మొదురు చినుకులు కురుస్తుండడంతో రైతులు ఆగమవుతున్నారు. కష్టించి పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తే వర్షానికి తడిసి నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. వాతావరణం మేఘావృతమై చల్లటి గాలులు వీస్తుండడంతో..రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ధాన్యం రాశుల మీద టార్పాలిన కప్పిన..గాలి వస్తే ఎక్కడ లేచిపోతాయో, ధాన్యం ఎక్కడ తడిచిపోతుందోనన్న భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం తడిసిన వరి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



## వివిధ నేరాలు, ఆధునిక చట్టాల పై అవగాహన సదస్సు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 29

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం లోని తెలంగాణ మోడల్ స్కూల్ ఇటిక్యాల నందు పోలీస్ అమర వీరుల వారోత్సవాలు భాగంగా సైబర్ నేరాలు, డ్రగ్స్ నిర్మూలన, ట్రాఫిక్ నియమాలు, మూఢ నమ్మకాలు, ఆధునిక చట్టాలు మీద పోలీస్ కళా బృందం చేత పాటల తో అవగాహన సదస్సు చేశారు. ఈ కార్యక్రమంలో రాయికల్ ఎస్ఐ సిహెచ్. సుధీర్ రావు, ప్రిన్సిపాల్ కొల్లూరి సంతోష్ కుమార్, ఏఎస్ఐ దేవేందర్ అజ్మెరా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ కళా బృందం పాల్గొన్నారు.

# రావిర్యాల పెద్దచెరువు ముంపును అరికడతాం: కేఎల్ఆర్

### తూములు, గుర్రపుడెక్క సమస్యకు త్వరలోనే పరిష్కారం

### రోడ్డు మరమ్మతులు, బ్రిడ్జి నిర్మాణంపై అధికారులతో చర్చ

### శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ భక్తులకు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హామీ



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన తప్పులకు ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.ప్రకృతి, సహజ వనరులను నాశనం చేయటం వల్ల తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాల పెద్ద చెరువు ఉప్పొంగి రోడ్లు, కాలనీలు ముంచెత్తుతున్నాయని కేఎల్ఆర్ అన్నారు. శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయం రోడ్డు మరమ్మతులు, చెరువులో గుర్రపు డెక్క తొలగింపు, బ్రిడ్జి పునరుద్ధరించి సమీప గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం త్వరలో కల్పిస్తామని కిచ్చెన్న హామీ ఇచ్చారు.తూములను పునరుద్ధరించి చెరువు ముంపు నుంచి రోడ్డు, కాలనీలను కాపాడుతామని... సంబంధిత అధికారులతో మాట్లాడారు. హెచ్ఎండిఎ ఆర్%డ%బీ, మున్సిపాలిటీ ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని లక్ష్మారెడ్డి కోరారు.



## వర్షాల దాటికి కూలిన నిరుపేద ఇల్లు నిరాశ్రుయులైన కుటుంబం

### ప్రభుత్వం తక్షణమే స్పందించి

### ఆర్థిక సహాయం అందించాలి - కొత్త ఇంటిని మంజూరు చేయాలి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధియాదాద్రి భువనగిరి జిల్లా సంస్థ నారాయణపురం మండల కేంద్రంలో విస్తారంగా కురిసిన భారీ వర్షాలకు గ్రామానికి చెందిన నెతి కార్ శ్రీనివాస్ పురాతన మట్టి గోడల మట్టిఇల్లు కూలిపోయింది, రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు గోడలు నాని ఒక్కసారిగా కుప్పకూలింది ఇల్లు కూలే శబ్దం విని కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీయడంతో ప్రాణ నష్టం జరగలేదు నిలువ నీడ కోల్పోయిన నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించి కొత్త ఇల్లును మంజూరు చేయాలని గ్రామ నాయకులు తెలిపారు

## వర్గీకరణతో కూడిన బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

### ఏం హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లంపల్లి రాంబాబు



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 : కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఏబిసిడి వర్గీకరణతో కూడిన 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని మంగలి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లంపల్లి రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం బాలాపూర్ మండలం బడంగ్ పేట్ లో రాంబాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి మీటింగ్ లో డిక్లరేషన్ చేయడమే కాకుండా ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా బీసీ రిజర్వేషన్లు 42 శాతం ఏబిసిడి ఉప వర్గీకరణతో అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీసీ కులాలు దాదాపు 130 వరకు ఉండగా.. ఇప్పటి వరకు వందకు పైగా కులాలు కనీసం వార్డు మెంబర్ కూడా కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏబిసిడి వర్గీకరణతో కూడిన బిసి రిజర్వేషన్లు అమలు చేసినప్పుడే అన్ని వర్గాలకు సముచిత న్యాయం లభిస్తుందని, లేనిచో వందకు పైగా కలిగిన ఏం బీసీలు, సంచార జాతులు, అర్ధ సంచార జాతుల కులాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రాజ్యాంగం అందరికి సమాన హక్కులు, సమాన అవకాశాలు, అందరికి సమానత్వం కల్పించాలని స్పష్టంగా సూచిస్తున్న, పాలకులు మాత్రం పెడచెవిన పెడుతున్నారని మండిపడ్డారు. దేశానికి స్వతంత్రం వచ్చి దాదాపు 78 ఏళ్లు కావస్తున్న, ఇప్పటికి మెజార్టీ ప్రజలు రాజ్యాంగ ఫలాలను అందుకోలేకపోయారన్నారు. అగ్రకులాలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు లేని అడ్డంకులు, బీసీ రిజర్వేషన్లకు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఏ రిజర్వేషన్లు అమలు చేయాలన్న రాజ్యాంగ మౌలిక సూత్రాల ప్రకారం ఖచ్చితమైన జనాభా లెక్కలతో పాటు వారి వెనుకబాటు తనాని స్పష్టంగా చూయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ ఇవేమీ లేకుండానే దొడ్డిదారిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకురావడం జరిగిందని మండిపడ్డారు. నిజమైన పేదలకు రిజర్వేషన్లు ఇవ్వడాన్ని ఎవరు అడ్డుకోవడం లేదు. అదే విధంగా బీసీ రిజర్వేషన్లు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పాలకులు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. వర్గీకరణతో కూడిన బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేయాలని రాంబాబు కోరారు. బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న పార్టీలకు, నాయకులకు బిసిలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.



## ధాన్యం కొనుగోళ్ల సమస్యల పరిష్కారానికై కాల్ సెంటర్

### కలెక్టరేట్లో కాల్ సెంటర్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 29

వరి ధాన్యం కొనుగోళ్లలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి జగిత్యాల జిల్లా కలెక్టరేట్లో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో ధాన్యం కొనుగోళ్ల లో ఎదురయ్యే సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ ను బుధవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నంబర్ 18004258187 ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సంప్రదించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, డిఆర్డివో రఘువరన్, డీఎస్వో జితేందర్ రెడ్డి, డిఎం జితేంద్ర ప్రసాద్, సంబంధిత అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జలదిగ్బంధంలో కొమ్మేపల్లి గిరిజన గురుకుల పాఠశాల

### విద్యార్థులను క్షేమంగా రక్షించిన పోలీసు బృందం





దేవరకొండ అక్టోబర్ 29 వార్త మిర్రర్ ::దేవరకొండ నియోజకవర్గం వ్యాప్తంగా మొంత తుఫాన్ ప్రభావం వల్ల గత 24 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దేవరకొండ మండలం కొమ్మేపల్లి గ్రామంలోని గిరిజన గురుకుల పాఠశాల పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు.కనీసం విద్యార్థులు పాఠశాల నుండి బయటికి రాలేనంతగా మోకాళ్ల లోతు పైన నీరు చేరడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు.విషయం తెలుసుకున్న కలెక్టర్ ఇలా త్రిపాటి ఎస్పీ శరత్చంద్ర ప్రత్యక్షంగా ఘటన స్థలానికి చేరుకొని రెస్క్యూ చేసి తాడు సాయంతో విద్యార్థులను సురక్షితంగా, ప్రత్యేక వాహనాల్లో దగ్గర్లో ఉన్న బీసీ వెల్ఫేర్ హాస్టల్ కు తరలించారు దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు ఎస్పీ శర చంద్ర ఎ ఎస్పీ మౌనిక ఆర్డిఓ రమణారెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ లో ఆడబిడ్డ సునీతమ్మ గెలుపు కోసం మరో ఆడబిడ్డ

## జోరు వర్షంలోను కొనసాగుతున్న సబితమ్మ ఇంటింటికి ప్రచారం

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 : జూబ్లీహిల్స్ ప్రజల ఆశీర్వాదంతో మాగంటి సునీతమ్మ గెలుపు ఖాయం..అశేష ప్రజానికము మధ్య జోరు వానవెల వెల,.. తగ్గని అభిమానం. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారం వేగంగా కొనసాగుతోంది.ఎన్నికల ప్రచారంలో భాగముగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ తో కలిసి మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గము శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి జోరు వాన సైతం లెక్కచేయకుండా ఇంటింటి ప్రచారం నిర్వహించి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయం కొరకు కృషి చేయాలని, కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్ దేవుళ్లను ప్రార్థించారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ లో ప్రజలు ఎక్కడ చూసినా బిఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని జూబ్లీహిల్స్ ప్రజల ఆశీర్వాదంతో మాగంటి సునీతమ్మ భారీ విజయం సాధించడం ఖాయం అని తెలిపారు.గత పదేళ్లలో జూబ్లీహిల్స్ లో గోపీనాథ్ చేసిన చేసిన అభివృద్ధి అందరికీ కనబడుతోంది సబితమ్మ తెలిపారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో ధనవంతుల బేరసారాల కోసం పేదల ఇళ్లు కూలగొడుతోంది అని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిద్రమత్తులో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వము పేదవారిని నిద్రపోనివ్వకుండా ఇళ్ల నుండి బహిష్కరిస్తోంది అని ఆవేదన వ్యక్తం చేశారు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ని ఓడిస్తే, హైడ్రా పేదల వద్దకు దరిచేరదు అని మాగంటి సునీతమ్మ గెలిస్తే ప్రభుత్వం కళ్ళు తెరిచి పేదల జోలికి వెళ్ళదు అని పేర్కొన్నారు.ఈ యొక్క ప్రచార పర్వం అశేష జనవాహిని మధ్య జోరు వానను సైతం వెలవెలబోయేలా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు కదం తొక్కిన తీరు సునీతమ్మ విజయం లాంచనమే అని అన్నారు..



# గుంటూరు -పగిడిపల్లి మరియు మోటమర్రి - విష్ణుపురం సెక్షన్ల మధ్య విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థను మెరుగుపరచడానికి ఆమోదించిన రైల్వే మంత్రిత్వ శాఖ

### ఈ ప్రాజెక్టుకు దాదాపు రూ.188.31 కోట్లు వ్యయం అవుతుందని అంచనా....

### రైల్వే మంత్రిత్వ శాఖ







సికింద్రాబాద్, వార్త మిర్రర్ అక్టోబర్ 29...గుంటూరు – పగిడిపల్లి మరియు మోటమర్రి – విష్ణుపురం సెక్షన్ల మధ్య విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థను మెరుగుపరచడానికి చేసిన ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం దాదాపు రూ.188.31 కోట్లు. ప్రస్తుతం, 1%శ 25 ఖఎ% సామర్థ్యంతో విద్యుత్ ట్రాక్షన్ అందుబాటులో నున్న ఈ వ్యవస్థను 2 %శ 25ఖఎ% విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థగా పెంపు చేసే ప్రతిపాదనను ఇప్పుడు రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదించింది. విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థను పునరాభివృద్ధి చేయడంలో ప్రధానంగా సర్క్యూట్ బ్రేకర్ల మార్పు, స్విచ్చింగ్ స్టేషన్లు మరియు ప్రస్తుత వ్యవస్థలో అదనపు కండక్టర్లను వ్యవస్థాపించడం ఉంటాయి. కేంద్ర రైల్వే, సమాచార అండ్ ప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ ప్రాజెక్టు మంజూరు సంధర్భంగా ఈ విధంగా పేర్కొన్నారు. “ సికింద్రాబాద్ – విజయవాడ చాలా రద్దీగా ఉండే రైల్వే మార్గం. పగిడిపల్లి–గుంటూరు మరియు విష్ణుపురం – మోటుమారి సెక్షన్ సికింద్రాబాద్ మరియు విజయవాడ మధ్య ప్రత్యామ్నాయ మార్గంగా పనిచేస్తుంది. ఈ మార్గంలో మరిన్ని రైళ్లను నడపడానికి, పగిడిపల్లి–గుంటూరు మరియు విష్ణుపురం %–% మోటమర్రి సెక్షన్‌లో ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టమ్‌ను 2%ఇ25 ఖఎ% ట్రాక్షన్ సిస్టమ్‌ను మెరుగుపరచాలని రైల్వే నిర్ణయించింది. ఈ సెక్షన్‌ను రాబోయే 3 సంవత్సరాలలో రూ. 188 కోట్ల పెట్టుబడితో మెరుగుపరుస్తారు” .ఈ ప్రాజెక్ట్ తెలంగాణ %డ% ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిధిలోకి వస్తుంది. పగిడిపల్లి – గుంటూరు మరియు మోటమర్రి – విష్ణుపురం మధ్య మొత్తం ప్రాంతం దాదాపు 337 రూట్ కిలోమీటర్లు మరియు సింగిల్ లైన్ విభాగం. పగిడిపల్లి – గుంటూరు మధ్య ఉన్న ఈ విభాగం తెలంగాణ రాజధాని నగర ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని నగర ప్రాంతం మరియు దేశంలోని తూర్పు ప్రాంతాలతో అనుసంధానించే కీలకమైన ప్రాంతం. మోటమర్రి–విష్ణుపురం మధ్య ఉన్న విభాగం సరుకు రవాణాకు, ముఖ్యంగా బొగ్గు రవాణాకు చాలా ముఖ్యమైనది. ఈ కీలకమైన విభాగాల విద్యుదీకరణ మిషన్ విద్యుదీకరణలో భాగంగా పూర్తయింది మరియు ట్రాక్షన్‌లో మార్పు అవసరం లేకుండా ప్యాసింజర్ మరియు సరుకు రవాణా రైళ్లు సజావుగా నడపడానికి సహాయపడింది. మెరుగుపరచబడిన ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టమ్ అధిక వోల్టేజ్‌తో విద్యుత్ సరఫరాను అందిస్తుంది తద్వారా అధిక వేగంతో మరియు ఎక్కువ సామర్థ్యంతో రైళ్లను నడపడానికి సహాయపడుతుంది. మెరుగైన వోల్టేజ్ నియంత్రణతో, వోల్టేజ్ హెచ్చు తగ్గులు ఉండవు , రైళ్లకు స్థిరమైన వోల్టేజ్‌ను సులభతరం చేస్తాయి. ఈ 2 %ఇ% 25 కె. వి విద్యుత్ వ్యవస్థలో సర్క్యూట్ లోపాలను అధిగమించి నిరంతర విద్యుత్ ఆపరేషన్ కూడా అందిస్తుంది. ట్రాక్షన్ సబ్‌స్టేషన్ల అంతరాన్ని పెంచవచ్చు మరియు తద్వారా అవసరమైన సబ్‌స్టేషన్ల సంఖ్య తక్కువగా ఉంటుంది. ఈ వ్యవస్థ ప్యాసింజర్ మరియు సరుకు రవాణా రైళ్లు రెండింటినీ మరింత సమర్థవంతంగా సజావుగా నడపడంలో సహాయపడుతుంది.

## విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ::: స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీ వర్షాల కారణంగా రైతులు, విద్యార్థిని, విద్యార్థులు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి అన్నారు స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ ప్రజలుఅవసరమైతే తప్ప ఎవ్వరూ బయటకు రాకూడదని వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరే అవకాశం ఉంది అన్నారు చిన్నారులను, వృద్ధులను, ఒంటరిగా ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు పంపించవద్దు అని ఆయన సూచించారు.వర్షాలతో చెరువులు కుంటలు నిండి ప్రవహిస్తున్నందున రైతులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. చిన్నారులు తడిగా ఉన్న కరెంటు స్తంభాల వద్దకు వెళ్లకుండా చూసుకోవాలని తెలిపారు.ప్రజలందరూ పోలీసు, జిల్లా అధికారుల సూచనలతో తమ కుటుంబాల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వగలరని మనవి చేశారు.

## రియల్ ఎస్టేట్ బూమ్ తగ్గిపోతుందా?

### ఫ్లాట్లు ఇక తక్కువ ధరకే అందుబాటులో ఉంటాయా?

భారత రియల్ ఎస్టేట్ బూమ్ ముగిసిందని నిపుణులు అంటున్నారు. ధరలు తగ్గుతాయని ఆశిస్తున్న వారికి నిరాశే. సార్థక్ అహుజా ప్రకారం, ఇళ్ల ధరలు స్థిరంగా ఉంటాయే తప్ప తగ్గవు. ఆదాయ పెరుగుదల కంటే ధరల పెరుగుదల ఎక్కువ కావడంతో ఇళ్లు సామాన్యులకు అందుబాటులో లేవు.రియల్ ఎస్టేట్ బూమ్ ఆగిపోతుందా? ఈ రంగం కుప్పకూలిపోతుందా? ఫ్లాట్ ధరలు తగ్గుతాయా? ఇటీవలి రియల్ ఎస్టేట్ స్థితి చూసి చాలా మందికి వస్తున్న డౌట్లు ఇవి. దీనికి సమాధానంగా నిపుణులు చెబుతున్న మాట ఏంటంటే.. రియల్ ఎస్టేట్ బూమ్ ముగిసిందని అంటున్నారు. ద

గత కొన్ని సంవత్సరాలుగా క్రమంగా అభివృద్ధి చెందుతున్న ఇండియాలోని ఆస్తి మార్కెట్ ఇప్పుడు దాని ఊపును కోల్పోవచ్చా అని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ సార్థక్ అహుజా లింక్డ్ఇన్‌లోని ఒక పోస్ట్‌లో ప్రశ్నను లేవనెత్తారు? భారతదేశంలో రియల్ ఎస్టేట్ బూమ్ ముగిసి ఉండవచ్చు, కానీ ధరలు తగ్గుముఖం పట్టకుండా స్థిరంగా ఉంటాయని ఆయన అన్నారు.సామాన్యులు భరించలేని విధంగా ఇళ్ళు ఖరీదైనవిగా మారినప్పుడు, ధరలు పెరుగుతూనే ఉంటాయా లేదా తగ్గుతాయా అనే ప్రశ్నను అహుజా లేవనెత్తారు. గత కొన్ని సంవత్సరాల గణాంకాలను ఉటంకిస్తూ 2020 నుండి ఇండియాలో ఇళ్ల ధరలు ప్రతి సంవత్సరం దాదాపు 10 శాతం పెరిగాయని ఆయన అన్నారు. అదే సమయంలో ప్రజల సగటు ఆదాయంలో వార్షిక వృద్ధి దాదాపు 5 శాతం వద్ద మాత్రమే ఉంది. దీని వలన ఇల్లు కొనడం మరింత కష్టమైంది, ముఖ్యంగా ముంబై, గుర్గావ్ వంటి పెద్ద నగరాల్లో. ఇక్కడ సాధారణ ఇల్లు కొనడానికి ప్రజలు 20 నుండి 30 సంవత్సరాలు సంపాదించాలి.సార్థక్ అహుజా ప్రకారం.. బిల్డర్లు ఇప్పుడు ఎక్కువ లాభాలు ఆర్జించడానికి అల్ట్రా–లగ్జరీ ప్రాజెక్టులపై ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ధరల గురించి పెద్దగా పట్టించుకోని కొనుగోలుదారులను వారు లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీని కారణంగా సరసమైన ఇళ్ల లభ్యత గణనీయంగా తగ్గింది. గత రెండేళ్లలో హైదరాబాద్‌లో అలాంటి ఇళ్ల సంఖ్య 70 శాతం తగ్గింది. ముంబైలో 60 శాతం తగ్గుదల, ఎన్‌సిఆర్‌లో 50 శాతం తగ్గుదల కనిపించింది.

# డియాస్ ఇరాయ్



మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్ తనయుడు ప్రణవ్ ‘హృదయం’ చిత్రంతో దక్షిణాది ప్రేక్షకులకు చేరువయ్యారు. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా సినిమా ‘డియాస్ ఇరాయ్’. మిస్టరీ హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో శ్రీస్రవంతి మూవీస్ విడుదల చేస్తున్నది. ఈ చిత్రానికి రాహుల్ సదాశివన్ దర్శకత్వం వహించారు. ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. విభిన్న కథాంశంతో రూపొందిన ఈ మిస్టరీ థ్రిల్లర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని శ్రీస్రవంతి మూవీస్ అధినేత రవికిషోర్ తెలిపారు. సుస్మితాభట్, జిబిన్ గోపీనాథ్, జయ కురుప్, మనోహరి జాయ్ తదితరులు ఈ చిత్ర తారాగణం. క్రిష్టో జేవియర్ సంగీతాన్నందించారు.



# రాజ్‌తరుణ్ కథానాయకుడిగా ‘చిరంజీవ’

రాజ్‌తరుణ్ కథానాయకుడిగా నటించిన ‘ఆహా’ ఒరిజినల్ ఫిల్మ్ ‘చిరంజీవ’. కుషిత కల్లపు కథానాయిక. అభినయ కృష్ణ దర్శకుడు. రాహుల్ అవుదొడ్డి, సుహాసినీ రాహుల్ నిర్మాతలు. నవంబర్ 7న ఈ సినిమా ‘ఆహా’ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం వినోదం, యాక్షన్‌తో కూడుకొని ఉంది. ఇందులో రాజ్‌తరుణ్ పోషించిన పాత్ర పేరు శివ. తను పుట్టగానే మహర్జాతకుడు అవుతాడని పండితులు చెబుతారు. చిన్నప్పట్నుంచీ తనకు స్పీడెక్కువ. అందుకు తగ్గట్టు అంబులెన్స్ డ్రైవర్ అవుతాడు. అనుకోకుండా రోడ్ ప్రమాదానికి గురైన శివకు తనకు తెలీకుండానే అతీంద్రీయ శక్తులు వచ్చేస్తాయి. ఎవరెవరు ఎంతకాలం జీవిస్తారో తనకు తెలిసిపోతుంటుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అనే ప్రశ్నతో ట్రైలర్ ముగించారు. ఈ చిత్రానికి కెమెరా: రాకేష్ ఎస్.నారాయణ్, సంగీతం: అచ్చుమణి.



# విందు భోజనంలా మాస్‌జాతర

అగ్ర హీరో రవితేజ కథానాయకుడిగా రూపొందిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘మాస జాతర’. శ్రీలీల కథానాయిక. భాను భోగవరపు దర్శకుడు. సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానున్నది. ప్రచారంలో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ని సోమవారం విడుదల చేశారు. రవితేజ మార్క్ పంచ్ డైలాగులతో, భారీ యాక్షన్ సన్నివేశాలతో ఫ్యాన్స్ కోరుకునే మాస్ అంశాలతో ఆద్యంతం వినోదాత్మకంగా ట్రైలర్ సాగింది. హీరో, విలన్ల మధ్య ఉత్కంఠరేకెత్తించే సంఘర్షణ ట్రైలర్‌కు హైలైట్. నవీన్‌చంద్ర విలన్‌గా రవితేజను ఢీకొట్టే పాత్రలో కనిపించారు. శ్రీలీల అందం, శ్రీకాకుళం యాసలో తను మాట్లాడిన తీరు, రవితేజ, శ్రీలీల ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ ట్రైలర్‌కు మరింత అందాన్ని తెచ్చాయి. భీమ్స్ సిసిరోలియో కూడా తన నేపథ్య సంగీతంతో వింటేజ్ రవితేజ ఆరాను గుర్తు చేశారు. ఆకట్టుకునే పాటలు, అద్భుతమైన వినోదం మొత్తంగా విందుభోజనాన్ని తలపించిందీ ట్రైలర్. ఈ సినిమాకు కెమెరా: విధు అయ్యన్న.

# షాకైన సలార్ బ్యూటీ


సౌత్ స్టార్ హీరోయిన్ శృతి హాసన్ ప్రస్తుతం తెలుగు, తమిళ, హిందీ సినిమాలతో బిజీగా ఉంది. విజయాల పరంగా కాస్త అసంతృప్తి ఉన్నప్పటికీ, ఆఫర్ల పరంగా మాత్రం ఎప్పుడూ కొదవలేదు. ఇటీవల వరుసగా ‘వాల్తేరు వీరయ్య’, ‘సలార్’ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద హిట్లు కొట్టిన శృతి, రీసెంట్‌గా ‘కూలీ’ ద్వారా ప్రేక్షకులను అలరించింది. ఇటీవల ఆమె సౌత్ మరియు బాలీవుడ్ ఇండస్ట్రీల మధ్య ఉన్న తేడా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. “సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఉన్న నటులు చాలా వినయంగా ఉంటారు. ఇక్కడ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది అని చెప్పుకొచ్చింది. సినిమా ప్రారంభోత్సవం రోజున దేవుడి పటాల ముందు కొబ్బరికాయలు కొట్టడం, పూజలు చేయడం, మనసులో కోరికలు కోరుకోవడం వంటివి సాధారణం. అయితే నేను తొలిసారిగా ఇవి చూసినప్పుడు ఆశ్చర్యపోయాను, ఎందుకంటే మా ఇంట్లో ఇలాంటి ఆచారాలు ఎప్పుడూ ఉండేవి కావు, పూజలు పెద్దగా చేసేవారు కాదు, కానీ క్రమశిక్షణ మాత్రం ఎప్పుడూ ఉండేది అని ఆమె చెప్పింది. అదే సమయంలో బాలీవుడ్‌లో ఈ రకమైన ఆచారాలు పెద్దగా కనిపించవని కూడా శ్రుతి పేర్కొంది. “హిందీ సినిమాల్లో చాలా తక్కువ మంది మాత్రమే ఇలాంటివి పాటిస్తారు. సౌత్‌లో డబ్బు సంపాదించిన వారు కూడా పాత పద్ధతులను గౌరవిస్తుంటారు. వారిని చూస్తే ఇంకా పాత అంబాసిడర్ కారులోనే ప్రయాణిస్తున్నారా అనిపిస్తుంది. వారు ఆడంబరాల కంటే విలువలకు ప్రాధాన్యం ఇస్తారు” అని చెప్పింది. తన తండ్రి కమల్ హాసన్ విషయానికొస్తే, ఆయన కూడా దేవుళ్లు, ఆచారాలు నమ్మని వ్యక్తి అని శ్రుతి గుర్తుచేసింది. “కమల్ గారు ఎప్పుడూ తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటారు. పలు సందర్భాల్లో ఆయన వ్యాఖ్యలు వివాదాలకు దారితీసినా, తాను నమ్మిన దారినే ఎంచుకుంటారు. ఆ లక్షణం నాకు కూడా వచ్చింది” అని శృతి హాసన్ స్పష్టం చేసింది.



# సమాంతర ప్రపంచాల నేపథ్యంలో..

అగ్ర హీరో అల్లు అర్జున్ కథానాయకుడిగా, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో ఓ భారీ పానిండియా చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. AA22xA%6 వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని సైన్స్ ఫిక్షన్‌తో కూడిన ట్కస్టైలిష్ డ్రామాగా దర్శకుడు అట్లీ రూపొందిస్తున్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమాపై ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో హల్‌చల్ చేస్తున్నది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతున్నది. దీనికోసం ఓ భారీ సెట్‌ను కూడా నిర్మించారు. ఈ సెట్‌లో యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్నారట. బన్నీతోపాటు కీలక తారాగణం పాల్గొంటున్న ఈ షూట్‌లో మృణాళ్‌ఠాకూర్ ఎంట్రీ ఇచ్చారనేది లేటెస్ట్ న్యూస్. ఇందులో మృణాళ్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే.. ఈ సినిమా కథ విషయంలో కూడా ఓ ఆసక్తికరమైన విషయం వెలుగు చూసింది. ఇది రెండు సమాంతర ప్రపంచాల నేపథ్యంలో సాగే కథట. ఈ రెండు ప్రపంచాలకూ గల సంబంధమేంటి? అనేది ఇందులో ఆసక్తికరమైన అంశం. బన్నీ ఇందులో మల్టిపుల్ క్యారెక్టర్లు చేస్తున్నట్టు గతంలో వార్తలొచ్చాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఇందులో ఆయన ద్విపాత్రాభినయం మాత్రమే చేస్తున్నారట. దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్, మృణాళ్ ఠాకూర్ కీలక పాత్రధారులు. ప్రతిష్టాత్మక సన్ పిక్చర్స్ అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదల తేదీని సంక్రాంతికి ప్రకటించే అవకాశం ఉంది.





# అందమైన ఫిగరు నువ్వా..

నాగశౌర్య కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘బ్యాడ్‌బాయ్ కార్తీక్’. రామ్ దేశిన దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని శ్రీవైష్ణవి ఫిల్మ్స్ పతాకంపై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ చిత్రం నుంచి ‘అందమైన ఫిగరు నువ్వా’ అనే పాటను విడుదల చేశారు. హారిస్ జైరాజ్ స్వరపరచిన ఈ పాటను కృష్ణకాంత్ రచించారు. శ్రీధర్ సేన, ప్రియా జెర్సన్ ఆలపించారు. ఈ పాటలో నాయకానాయికలు నాగశౌర్య, విధి మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. త్వరలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సముద్రఖని, నరేష్ వీకే, సాయికుమార్, మైమ్ గోపి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హారిస్ జైరాజ్, రచన-దర్శకత్వం: రామ్ దేశిన (రమేష్).